# ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేయొద్దు: మండల సురేందర్

**విద్యా హక్కు చట్టానికి విరుద్ధంగా పాఠశాలల కుదింపు చర్యలు -గ్రామీణ విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడుతోంది**

**భీమదేవరపల్లి/ జూన్ 10 (జర్నలిస్ట్ వార్త):** రాష్ట్రంలో విద్యాశాఖ నిర్వహణ అధ్వానంగా మారిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాల్సిన సమయంలో బలహీనపరిచే విధానాలను అమలు చేస్తోందని భీమదేవరపల్లి బీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు మండల సురేందర్ విమర్శించారు. బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన ప్రభుత్వ విద్యారంగ పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రభుత్వం ఒకవైపు ప్రభుత్వ విద్యను అభివృద్ధి చేస్తామని ప్రకటిస్తూనే, మరోవైపు రాష్ట్రంలోని వేలాది ప్రభుత్వ పాఠశాలలను కుదించే ప్రయత్నాలు చేయడం అసమర్థతకు నిదర్శనమని పేర్కొన్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21ఏ ప్రకారం 6 నుండి 14 సంవత్సరాల వయస్సు గల ప్రతి బాలబాలికకు ఉచిత, నిర్బంధ విద్యను అందించడం ప్రభుత్వ రాజ్యాంగబద్ధ బాధ్యత అని గుర్తు చేశారు. విద్యా హక్కు చట్టం (ఆర్టీఈ-2009) ప్రకారం ప్రతి



విద్యార్థికి అందుబాటులో విద్యా సౌకర్యాలు కల్పించాల్సి ఉండగా, పాఠశాలల విలీనం లేదా కుదింపు కారణంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి తలెత్తకూడదన్నారు. విద్యాహక్కు చట్టం స్ఫూర్తికి విరుద్ధంగా ఉండే నిర్ణయాలను ప్రభుత్వం వెంటనే పునఃపరిశీలించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యపై చేసే ఖర్చును వ్యయంగా కాకుండా భవిష్యత్ తరాలపై పెట్టుబడిగా చూడాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం ద్వారా మాత్రమే సామాన్య ప్రజల పిల్లలకు నాణ్యమైన విద్య అందుతుందని అన్నారు. ప్రభుత్వ విద్యా వ్యతిరేక విధానాల కారణంగానే విద్యా కమిషన్ చైర్మన్ తన పదవికి రాజీనామా చేశారని, ఈ ఘటనతోనే రాష్ట్ర ప్రభుత్వ పనితీరు ఎంత అధ్వానంగా ఉందో అర్థమవుతుందని విమర్శించారు. విద్యారంగ సమస్యలపై ప్రభుత్వం వెంటనే దృష్టి సారించి, ఉపాధ్యాయుల ఖాళీలను భర్తీ చేయడంతో పాటు పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగుపరచాలని కోరారు. ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసే చర్యలకు బదులుగా విద్యా ప్రమాణాలను పెంపొందించే విధానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# రాంనగర్ స్టేజ్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం..

**యువకుడి పరిస్థితి విషమం**





**భీమదేవరపల్లి/జూన్10 (జర్నలిస్ట్ వార్త):** భీమదేవరపల్లి మండలం రాంనగర్ స్టేజ్ వద్ద బుధవారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ట్రాక్టర్, మోటార్ సైకిల్ ఢీకొన్న ఈ ప్రమాదంలో మోత్కులపల్లి గ్రామానికి చెందిన మండల అజయ్ యాదవ్ (26) తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల సమాచారం ప్రకారం అజయ్ యాదవ్ తన బైక్‌పై ముల్కనూర్ నుంచి హుస్నాబాద్ వైపు వెళ్తుండగా రాంనగర్ స్టేజ్ సమీపంలో ట్రాక్టర్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో బైక్ పూర్తిగా ధ్వంసం కాగా, అజయ్ యాదవ్‌కు తలకు, శరీరంలోని పలు భాగాలకు తీవ్ర గాయాలైనట్లు తెలుస్తోంది. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న అంబులెన్స్ సిబ్బంది ప్రాథమిక చికిత్స అందించి అతడిని మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఆస్పత్రికి తరలించారు.

# ప్రజల భాగస్వామ్యంతో గ్రామాభివృద్ధి

**ఇంచార్జ్ సర్పంచ్ మాట్ల హరికుమార్**





**భీమదేవరపల్లి/జూన్10 (జర్నలిస్ట్ వార్త):** భీమదేవరపల్లి మండలం ముత్తారం గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా బుధవారం గ్రామసభను ఘనంగా నిర్వహించారు. గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద ఇంచార్జ్ సర్పంచ్ మాట్ల హరికుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు హాజరై గ్రామ ప్రజల సమస్యలను తెలుసుకొని ప్రభుత్వ పథకాల అమలు తీరుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామసభలో మాట్లాడిన అధికారులు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం లక్ష్యాలను వివరించారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, తాగునీటి సరఫరా, వ్యవసాయ అభివృద్ధి, విద్యా ప్రమాణాల పెంపు, మహిళా మరియు శిశు సంక్షేమ కార్యక్రమాల అమలు, సాగునీటి సదుపాయాల మెరుగుదల వంటి అంశాలపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు గ్రామ అభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని, గ్రామసభల ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో నాగరాజు, మండల వ్యవసాయ అధికారి పద్మ, ఎంఈవో సునీత రాణి, గ్రామీణ నీటి సరఫరా శాఖ డీఈ, ఇరిగేషన్ ఏఈ శశిధర్ రెడ్డి, ఐసీడీఎస్ సూపర్వైజర్, పంచాయతీ కార్యదర్శి నరేష్ తదితర అధికారులు పాల్గొన్నారు. ఆయా శాఖలకు సంబంధించిన సంక్షేమ పథకాలు, సేవల గురించి గ్రామస్తులకు వివరించి, ప్రజల నుంచి వచ్చిన సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. గ్రామసభలో గ్రామస్తులు తాగునీరు, రహదారులు, డ్రైనేజీలు, విద్యుత్, వ్యవసాయానికి సంబంధించిన సమస్యలు, సంక్షేమ పథకాల అమలులో ఎదురవుతున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. గ్రామాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ పథకాల సమర్థవంతమైన అమలే లక్ష్యంగా ఈ గ్రామసభ నిర్వహించబడిందని ఇంచార్జ్ సర్పంచ్ మాట్ల హరికుమార్ తెలిపారు. గ్రామ ప్రజలు పాల్గొని గ్రామసభను విజయవంతం చేయడం పట్ల ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పంచాయితీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, మహిళలు, రైతులు, యువకులు మరియు గ్రామ పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసిన సింగారం సర్పంచ్.



**బయ్యారం/,జూన్ 10.(జర్నలిస్ట్ వార్త)**బయ్యారం మండలం సింగారం గ్రామపంచాయతీలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆదేశాల మేరకు సింగారం పంచాయతీలో అనారోగ్యంతో చికిత్స చేయించుకున్న గుగులోత్ విజయ 32 వేలు,గుగులోత్ బిచ్చ 13500,సపవత్ చందన 32 వేల రూపాయల సిఎంఆర్ఎఫ్ చెక్కులను సర్పంచ్ సపవత్ సరస్వతి రాందాస్ నాయక్ చేతులమీదుగా పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చుంచు మమతా,వార్డు సభ్యులు చెరుకుపల్లి మనీషా, బాధవత్ లల్యా నాయక్, గుగులోత్ భద్రు నాయక్,సపవత్ అనిత,మాజీ ఎంపీటీసీ కొత్తపల్లి సీతారాములు,ఇందిరమ్మ కమిటీ సభ్యులు చెరుకుపల్లి రవి,గుగులోత్ అమర్ సింగ్, గ్రామ నాయకులు గుగులోత్ శ్రీను నాయక్,గుగులోత్ మహేష్ నాయక్,మంగీలాల్ నాయక్, బిచ్చ,కిష్ట,కస్నా,తదితరులు నాయకులు పాల్గొన్నారు.

# పాలనలో నరేంద్ర మోదీ సరికొత్త చరిత్ర.

**-అభినందనలు తెలిపిన తుమ్మల శ్రీనివాస్**



**బయ్యారం/,జూన్ 10.(జర్నలిస్ట్ వార్త)** వరుసగా అత్యధిక కాలం పాలించిన ప్రధానిగా మోదీ 4,399 రోజులు పూర్తి చేసుకొని దేశ ప్రజలకు ఉన్న నమ్మకానికి ఇది నిదర్శనమని,భారత రాజకీయ చరిత్రలో సరికొత్త అధ్యాయం లిఖించబడిందని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి తుమ్మల శ్రీనివాస్ అన్నారు.ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ దేశ ప్రధానిగా నరేంద్ర మోదీ వరుసగా అత్యధిక కాలం పాలించిన అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నారన్నారు.దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ రికార్డును అధిగమించి మోదీ ఈ ఘనత సాధించారు. 2014 మే 26న తొలిసారి బాధ్యతలు చేపట్టిన మోదీ, నేటితో (బుధవారం) ప్రధానిగా వరుసగా 4,399 రోజులు పూర్తి చేసుకున్నారు.గతంలో నెహ్రూ ఎన్నికైన ప్రధానిగా వరుసగా 4,398 రోజులు (1952 మే 13 నుండి 1964 మే 27 వరకు) పనిచేయగా.. ఇప్పుడు మోదీ ఆ రికార్డును దాటేశారు. ప్రధానిగా మోదీ 12 ఏళ్లు పూర్తి చేసుకున్న ఈ చారిత్రాత్మక మైలురాయి సందర్భంగా తుమ్మల శ్రీనివాస్ రావు ప్రధానికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.మోదీ నాయకత్వంపై దేశ ప్రజలకు ఉన్న అచంచలమైన నమ్మకానికి ఈ సుదీర్ఘ పాలనే నిదర్శనమని అయన కొనియాడారు. ఆయన హయాంలో దేశం అన్ని రంగాల్లో వేగంగా దూసుకుపోతోందని,ఆత్మనిర్భర్, వికసిత్ భారత్ దార్శనికతతో ప్రధాని మోదీ దేశాన్ని మరింత ముందుకు తీసుకెళ్తారని, ఆయన స్ఫూర్తిదాయక ప్రస్థానం భావితరాల్లో భారత ప్రజాస్వామ్యంపై నూతన విశ్వాసాన్ని నింపుతుందని తుమ్మల శ్రీనివాస్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఘనంగా నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలు

**కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్న టీడీపీ శ్రేణులు**




**తల్లాడ, /జూన్ 10 (జర్నలిస్ట్ వార్త):**నటసింహ, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదినాన్ని పురస్కరించుకుని తల్లాడ మండల కేంద్రంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు సరికొండ శ్రీనివాసరాజు కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టి బాలకృష్ణకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం జరిగిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ, సినీ రంగంలో ఐదు దశాబ్దాలకు పైగా విశిష్ట సేవలందించిన బాలకృష్ణకు పద్మభూషణ్ పురస్కారం లభించడం తెలుగు ప్రజలకు గర్వకారణమని పేర్కొన్నారు. నటుడిగా అనేక రికార్డులు సృష్టించడమే కాకుండా, రాజకీయ రంగంలోనూ ప్రజాదరణ పొందిన నాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్నారని అన్నారు.

హిందూపురం నియోజకవర్గం నుంచి వరుస విజయాలు సాధించడం ఆయన ప్రజలతో ఉన్న అనుబంధానికి నిదర్శనమని పేర్కొన్నారు. పేదలకు వైద్య సేవలు అందిస్తూ సేవా కార్యక్రమాల్లోనూ ముందుంటున్నారని కొనియాడారు.సినీ, రాజకీయ, సేవా రంగాల్లో విశిష్ట కృషి చేస్తున్న బాలకృష్ణ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. అనంతరం కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో టౌన్ అధ్యక్షుడు మొక్క కృష్ణార్జునరావు, ధూపాటి భద్రరాజు, నారపోగు ప్రసాద్‌బాబు, దుగ్గిని వెంకటేశ్వరరావు, కొమ్మినేని సత్యనారాయణ, సుదర్శన్, టెంట్ హౌస్ సురేష్, నాగేశ్వరరావు, దోనేష్ తదితరులు పాల్గొన్నారు.

# ధర్తీ మాతా అభియాన్ ప్రోగ్రాంలో సర్పంచులకు భూసార పరిరక్షణ,ఎరువుల వాడకంపై అవగాహన.





**బయ్యారం/,జూన్ 10.(జర్నలిస్ట్ వార్త)** బయ్యారం మండల కేంద్రంలోని రైతువేదికలో మండల వ్యవసాయ అధికారి కే.రాజు ఆధ్వర్యంలో ధర్తి మాతా బచావో అభియాన్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ స్థాయిలో నిగ్రాణి సమితుల ప్రాముఖ్యత గురించి సమావేశం అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో మండలంలోని గ్రామపంచాయతీల సర్పంచులు పాల్గొన్నారు.ఈ సమావేశంలో భూసార పరిరక్షణ, రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించడం,సమగ్ర ఎరువుల యాజమాన్య విధానాలను ప్రోత్సహించడం,నకిలీ విత్తనాల బారిన పడకుండా రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలు,పంట అవశేషాల దహనం వల్ల కలిగే నష్టాలు,పంటల వైవిధ్యీకరణ యొక్క ప్రాముఖ్యత,రానున్న వర్షాకాలంలో వ్యవసాయ సీజన్‌కు రైతులు ముందస్తుగా చేపట్టవలసిన చర్యలపై విస్తృతంగా అవగాహన కల్పించారు.
వ్యవసాయ భూముల ఆరోగ్యాన్ని కాపాడుతూ,సుస్థిర వ్యవసాయ పద్ధతులను అవలంబించడం ద్వారా దిగుబడులు పెంపొందించుకోవచ్చని రైతులకు సూచించారు.అలాగే నకిలీ విత్తనాలు,అనధికార విక్రయదారుల పట్ల అప్రమత్తంగా ఉండాలని,లైసెన్స్ కలిగిన డీలర్ల వద్ద నుంచే విత్తనాలు , ఎరువులు,పురుగు మందులు కొనుగోలు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రవి కిరణ్, డిఆర్వో రవి,సర్పంచులు,ఏఈవోలు,అటవీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# కొత్తపేటలో సీసీ రోడ్డు నిర్మాణం కొరకు పరిశీలన.



**బయ్యారం/,జూన్ 10.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండలం గంధంపల్లి కొత్తపేట గ్రామపంచాయతీలో సిసి రోడ్డు నిర్మాణం చేయుటకు స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సర్పంచ్ భూక్య ప్రవీణ్ నాయక్ పంచాయతీలో గత కొన్ని సంవత్సరాలనుండి గుంతలు పడి నిరూపయోగంగా ఉండి ప్రజలు నడవడానికి ఇబ్బందిగా ఉన్న కచ్చా రోడ్డును సిసి రోడ్డుగా మార్చుటకు నిధులు మంజూరు చేయించారు.ఈ సందర్భంగా కాలనీ వాసుల చిరకాల కోరిక అయిన రోడ్డు నిర్మాణం కోసం కృషి చేసిన సర్పంచ్ ను అభినందిస్తూ సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రావి వీరభద్ర రావు,తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు వడ్లమూడి కోటేశ్వరరావు, వార్డు సభ్యులు ఈసం స్వరూప,గ్రామస్తులు,ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగ హక్కులను కాలరాయడం సరికాదు

## బీజేపీ తప్పుడు విధానాలను ఖండిస్తున్నాం: దుండేటి వీరారెడ్డి



**తల్లాడ,/ జూన్ 10 (జర్నలిస్ట్ వార్త):**
మధ్యప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ అంశంలో బీజేపీ రాజకీయ దురుద్దేశంతో వ్యవహరిస్తోందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, వైరా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దుండేటి వీరారెడ్డి ఆరోపించారు.బుధవారం విలేకరులతో మాట్లాడుతూ, ఎన్నికల్లో పోటీ చేయడం ప్రతి పౌరుడికి రాజ్యాంగబద్ధమైన హక్కు అని, ఆ హక్కును హరించే విధంగా బీజేపీ వ్యవహరిస్తోందని విమర్శించారు. అఫిడవిట్ పత్రాల్లో ఎలాంటి లోపాలు లేకున్నా ఎన్నికల సంఘాన్ని అడ్డుపెట్టుకుని నామినేషన్ తిరస్కరింపజేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు.ఒక రాజ్యసభ స్థానాన్ని గెలుచుకోవడం కోసం బీజేపీ దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతోందని దుయ్యబట్టారు. దేశ ప్రజలు బీజేపీ విధానాలను గమనిస్తున్నారని, తగిన సమయంలో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని వీరారెడ్డి హెచ్చరించారు.

# సూరారం గ్రామంలో ఎలుగుబంటి సంచారం

## భయాందోళనలో గ్రామస్థులు.. అప్రమత్తమైన అధికారులు



**ఎల్కతుర్తి, /జూన్ 10 (జర్నలిస్ట్ వార్త):**
ఎల్కతుర్తి మండలం సూరారం గ్రామంలో ఎలుగుబంటి సంచారం కలకలం రేపింది. మంగళవారం రాత్రి గ్రామంలోని ముస్లిం కాలనీలో ఎలుగుబంటి తిరుగాడడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు.గ్రామస్తుల కథనం ప్రకారం, నాలుగు రోజుల వ్యవధిలో రెండోసారి ఎలుగుబంటి గ్రామంలో కనిపించింది. దీంతో కాలనీ వాసులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు ఇళ్ల బయటకు రావడానికి సైతం భయపడుతున్న పరిస్థితి నెలకొంది.ఎలుగుబంటి సంచారం విషయాన్ని గ్రామస్తులు స్థానిక ప్రజాప్రతినిధులు, ఎల్కతుర్తి పోలీసులకు, అటవీ శాఖ అధికారులకు తెలియజేశారు. గ్రామంలో తిరుగుతున్న ఎలుగుబంటిని గుర్తించి సురక్షితంగా అటవీ ప్రాంతానికి తరలించాలని కోరుతున్నారు.అటవీ శాఖ అధికారులు తక్షణమే స్పందించి ప్రజల భద్రతకు అవసరమైన చర్యలు చేపట్టాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.

# యాదవ చైతన్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పల్లెవేని రవీందర్ యాదవ్



**ఎల్కతుర్తి, /జూన్ 10 (జర్నలిస్ట్ వార్త):**
ఎల్కతుర్తి మండలంలోని కోతులనడుమ గ్రామానికి చెందిన పల్లెవేని రవీందర్ యాదవ్‌ను యాదవ చైతన్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు గొర్ల ఐలేష్ యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ బీసీల సంక్షేమం, యాదవ సంఘాల అభివృద్ధి కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు. యాదవుల సామాజిక, ఆర్థిక పురోగతికి తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు.ఈ సందర్భంగా రాష్ట్ర చైతన్య వేదిక నాయకులు జక్కుల శ్రీనివాస్ యాదవ్, పల్లెవేని పోచమల్లు యాదవ్, మంతుర్తి సమ్మయ్య యాదవ్, పోతరవేణి లింగమూర్తి యాదవ్ తదితరులకు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూ, తనకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

# టైల్స్ వర్కర్స్ యూనియన్, పెంకు ఫ్యాక్టరీ యాజమాన్యం మధ్య చర్చలు విఫలం.

## సమ్మె తీవ్రతరం చేస్తాం... -యూనియన్ పిలుపు....





**బయ్యారం/,జూన్ 10.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండలం కొత్తపేట పూర్ణ టైల్స్ వేదికగా తెలంగాణ టైల్స్ వర్కర్స్ యూనియన్ పెంకు ఫ్యాక్టరీ యాజమాన్యం మధ్య చర్చలు బుధవారం నిర్వహించారు.చర్చలకు మహబూబాబాద్ జిల్లా భద్రాది కొత్తగూడెం యూనియన్ నాయకులు పెంకు ఫ్యాక్టరీ యాజమాన్యం హాజరైయ్యారు.కార్మికుల న్యాయమైన వేతనాలు పెంచాలని కార్మికుల డిమాండ్స్ ఆమోదించాలని యాజమాన్యన్ని కోరారు.కార్మికుల వేతనాలు పెంచడం కుదరదని మొండివైఖరితో వ్యవహరించిన పెంకు ఫ్యాక్టరీ యాజమాన్యం.పెంకు యాజమాన్యం మొండివైఖరిని నిరసిస్తూ ఈ నెల 12న బయ్యారం మండల కేంద్రంలో భారీ నిరసన ప్రదర్శన ఏర్పాటు చేస్తామని తెలంగాణ టైల్స్ వర్కర్స్ యూనియన్ తెలిపింది.సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ అశోక్ ఈ చర్చల్లో పాల్గొన్నారు.పెంకు కార్మికులు చాలీచాలని వేతనాలతో అనేక ఇబ్బందులు గురవుతున్నారు ఇప్పటికైనా పెంకు ఫ్యాక్టరీ యజమాన్యం మొండి వైఖరి వీడనాడి కార్మికులతో చర్చలు జరపాలని లేనియెడల ఈ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు వై బాగుల శ్రీను,నాయకులు వంగూరి వెంకన్న ఎస్.కె పాషా,సాంబయ్య, బుగ్గ రవి,రామచంద్రు, గణేష్,భానోత్ ఊట్ల, భూక్య లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# పథకాల కోసం పైసా ఇవ్వొద్దు.. అర్హుల ఇంటికే లబ్ధి చేరాలి

**పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట**

**ధర్మసాగర్‌లో 39 మందికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ**

**అవినీతి, అక్రమాలకు తావులేకుండా సుపరిపాలన లక్ష్యం: ఎమ్మెల్యే కడియం శ్రీహరి**



**ధర్మసాగర్,/హనుమకొండ బ్యూరో జూన్ 10 (జర్నలిస్ట్ వార్త):**ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం ఎవరూ ఒక్క రూపాయి కూడా మధ్యవర్తులకు ఇవ్వాల్సిన అవసరం లేదని, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ లబ్ధి నేరుగా అందేలా చర్యలు తీసుకుంటున్నామని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే, మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి స్పష్టం చేశారు. నియోజకవర్గంలో అవినీతి, అక్రమాలకు తావులేకుండా ప్రజలకు సుపరిపాలన అందించడమే తన లక్ష్యమని పేర్కొన్నారు.ధర్మసాగర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో బుధవారం నిర్వహించిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలానికి చెందిన 39 మంది లబ్ధిదారులకు రూ.39 లక్షల 4 వేల 524 విలువైన చెక్కులను పంపిణీ చేశారు.
అనంతరం నిర్వహించిన సభలో కడియం శ్రీహరి మాట్లాడుతూ పేదింట్లో ఆడపిల్ల పెళ్లి అంటే తల్లిదండ్రులకు పెద్ద ఆర్థిక భారం అవుతుందని, అలాంటి కుటుంబాలకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు అండగా నిలుస్తున్నాయని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న రూ.1,00,116 ఆర్థిక సాయం పేద కుటుంబాలకు ఎంతో ఉపశమనం కలిగిస్తోందని పేర్కొన్నారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులు, మహిళలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వంటి పథకాలు ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరుస్తున్నాయని తెలిపారు.
రాష్ట్రంపై ఆర్థిక భారం ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి పేదల సంక్షేమాన్ని ప్రాధాన్యంగా తీసుకుని పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. లబ్ధిదారుల దరఖాస్తులు నెల రోజుల్లోనే పరిష్కారమయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఇందిరమ్మ ఇళ్లు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎంఆర్ఎఫ్ లేదా ఇతర ప్రభుత్వ పథకాల కోసం ఎవరూ డబ్బులు ఇవ్వవద్దని ప్రజలకు సూచించారు. అర్హత ఉంటే ప్రభుత్వ లబ్ధి నేరుగా మీ ఇంటికే వస్తుందని స్పష్టం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు నిజాయితీగా పనిచేయాలని, అవినీతి లేదా నిర్లక్ష్యం కనిపిస్తే ప్రజల ముందే నిలదీస్తానని హెచ్చరించారు.అర్హులైన నిరుపేదలకే ప్రభుత్వ పథకాలు అందాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని పేర్కొన్న ఆయన, ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే అత్యధిక నిధులతో స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు





కొనసాగుతున్నాయని తెలిపారు. ఇటీవల రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కరూ.60.62 కోట్ల వ్యయంతో ఏడు విద్యుత్ సబ్‌స్టేషన్లకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసిన విషయాన్ని గుర్తుచేశారు.కార్యక్రమంలో తహసీల్దార్, ఎంపీడీవో, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# పచ్చదనమే భావితరాలకు నిజమైన ఆస్తి

## ప్రతి ఇంట్లో మొక్క నాటాలి.. ప్లాస్టిక్‌కు చెక్ చెప్పాలి -మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మీ రామానంద్





**నర్సంపేట/, జూన్ 10 (జర్నలిస్ట్ వార్త):**
పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, భావితరాల భవిష్యత్తు కోసం ప్రతి ఇంట్లో తప్పనిసరిగా మొక్కలు నాటాలని నర్సంపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మీ రామానంద్ పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా బుధవారం నర్సంపేట జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో మొక్కల నాటకం నిర్వహించారు.ఏసీపీ, మున్సిపల్ కమిషనర్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్, సీఐలతో కలిసి మొక్కలు నాటిన ఆమె, పర్యావరణ సమతుల్యతకు వృక్ష సంపదే మూలాధారమని పేర్కొన్నారు. మొక్కలు నాటడమే కాకుండా అవి వృక్షాలుగా ఎదిగే వరకు సంరక్షించడం కూడా సామాజిక బాధ్యతేనన్నారు. పెరుగుతున్న కాలుష్యం, అధిక ఉష్ణోగ్రతల నుంచి భూమిని కాపాడుకోవాలంటే పచ్చదనాన్ని పెంపొందించడం తప్పనిసరని తెలిపారు.మున్సిపాలిటీ పరిధిలో ప్రతి ఇంటికి ఉచితంగా మొక్కలు పంపిణీ చేస్తున్నామని, ఇంటి ఆవరణలో ఖాళీ స్థలం ఉన్నచోట ప్రజలు తప్పనిసరిగా మొక్కలు నాటాలని కోరారు. పర్యావరణానికి ముప్పుగా మారిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నియంత్రించాలని, పట్టణాన్ని స్వచ్ఛంగా ఉంచడంలో ప్రజలు భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. పట్టణాన్ని పచ్చదనంతో, పరిశుభ్రతతో ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు మున్సిపల్ యంత్రాంగం అన్ని చర్యలు చేపడుతోందని హామీ ఇచ్చారు.అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన రిహాబిలిటేషన్ కార్యక్రమంలో పాల్గొన్న చైర్‌పర్సన్, ప్రజలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రభుత్వం ఆసుపత్రుల ద్వారా ఉచితంగా అందిస్తున్న వైద్య సేవలు, రిహాబిలిటేషన్ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసుపత్రి అభివృద్ధికి, రోగులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు మున్సిపాలిటీ తరఫున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గంధం నరేందర్ గుప్తా, మాజీ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్య గౌడ్, టౌన్ ఎస్సై గూడ అరుణ్ కుమార్, కౌన్సిలర్లు కాంపెల్లి వీణ విజేందర్ రెడ్డి, పొన్నాల మనిషా ప్రకాష్, దొంగల రజిత, మాజీ ఎంపీటీసీ కాట ప్రభాకర్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

